ప్రజాశక్తి

గురువారం 18 జూన్ 2025 5 అనంతపురం

పోలీస్ టెక్నికల్ టీంకు ప్రోత్సాహకాలు

ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

25 మంది పోలీస్ ఐటి కోర్ టీం సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ బుధవారం నాడు ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్ వాచ్‌లు అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీసుశాఖ సుమారు 12 ఐటి అప్లికేషన్లు అమలు చేస్తోంది. వీటిలో సిసిటిఎన్ఎస్, మీ సేవ, స్మార్ట్ పోలీస్, ఐరాడ్, ఈ చలానా తదితర అప్లికేషన్లను వినియోగించడంలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఇటీవల కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన, బయోమెట్రిక్ తీసుకోవడం తదితర వాటిని నిర్వహించిన వారిని అభినందించారు.

ఉన్నత విద్యపై నిర్లక్ష్యం..!

- ◆ డిగ్రీ ప్రవేశాలు ఎప్పుడో..?
- ◆ ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు
- ◆ ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలకు విడుదల కాని షెడ్యూల్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కన్పిస్తోంది. డిగ్రీ ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గత ఏడాది కూడా ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కాలేజీల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 83 కళాశాలల్లో సగానికి పైగా కళాశాల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. అడ్మిషన్లు ఆలస్యం కావడమే దీనికి ప్రధాన కారణం అని తెలుస్తోంది. గత ఏడాది తలెత్తిన ఇబ్బందులను కనీసం ఈ ఏడాదైనా ఎదురు కాకుండా ఉండాలంటే వేగంగా అడ్మిషన్లు ప్రక్రియ పూర్తిచేయాలని ఉన్నత విద్యా శాఖకు పలు కళాశాలల ప్రతినిధులు ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఉన్నత విద్యా శాఖ పట్టించుకోలేదు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీలో చేరాలనుకున్న విద్యార్థులందరూ అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పున:ప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరిచారు. ఇంటర్ తరగతులు కూడా ఈ నెల 1 నుంచే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదు. దీంతో వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. డిగ్రీ విద్యను నిర్లక్ష్యం చేయడం వెనుక ప్రయివేటు, కార్పొరేట్ ఇంజినీరింగ్ కాలేజీల మనుగడ కోసమే అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిస్థితి ఇలా ఉంటే ప్రయివేటు కళాశాలలు మాత్రం సీట్లు భర్తీ చేసుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రయివేటు డిగ్రీ కళాశాలలో ఇప్పటికే విద్యార్థులను కళాశాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ లేక పోవడంతో విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని కొంత భాగం కోల్పోయే ప్రమాదం ఉంది. చదువులకు దూరంగా ఉండటం వలన చెడు వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగులుతున్న సీట్లు

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 86 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 73 ప్రయివేటు, 10 ప్రభుత్వ, మూడు అటానమస్ కాలేజీలు ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలో సుమారు 35 వేలకుపైగా సీట్లు ఉన్నాయి. సాధారణంగా అయితే 60 నుంచి 70 శాతం మేర సీట్లు భర్తీ అవుతుంటాయి. గడిచిన మూడేళ్ల నుంచి అడ్మిషన్లు ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి. గతేడాది అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యంగా నిర్వహించడం, మూడు విడతలకు మధ్య ఎక్కువ రోజులు ఖాళీ రావడంతో ప్రవేశాలు మరింత తగ్గాయి. గత విద్యా సంవత్సరం దాదాపు 40 కళాశాలలకు పైగా 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. కొన్ని గ్రూపుల్లో 10 నుంచి 15 మంది మాత్రమే చేరారు. విద్యార్థుల సంఖ్య తగ్గిన అనేక గ్రూపుల్లో అడ్మిషన్లు నిలిపివేయాలని ఆయా కాలేజీలు నిర్ణయించాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అయినా ప్రవేశాలకు సంబంధించిన ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖను ప్రైవేటు కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. అడ్మిషన్లకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన తరువాత మూడు దశల్లో అడ్మిషన్లు ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం రెండు నెలలు సమయం పడుతుంది. అది కూడా వేగంగా చేస్తే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రవేశాలు కల్పించడం ఆలస్యమైతే సీట్లు భారీగా మిగిలిపోతాయి. ఆగస్టు నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తే కొంతలో కొంతైనా మేలు కలుగుతుందన్న భావనను ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్నత విద్యాశాఖ ఎప్పటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తుందో చూడాల్సి ఉంది.

ప్రొటోకాల్ పాటించకుంటే చర్యలు

◆ ఉపాధి అక్రమాలపై ఆకస్మిక తనిఖీలు ◆ 'దిశా' సమావేశంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపడుతున్న సమయంలో కనీస ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా. దీనిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే మీ ఉద్యోగాలు పోతాయి. జాగ్రత్తగా ఉండండి' అంటూ అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ డిడబ్ల్యుఎంఎ పీడీని హెచ్చరించారు. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే పథకాలపై సమీక్ష సమావేశం బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జరిగింది. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుపై జరిగిన సమీక్షలో ఎంపీ మాట్లాడుతూ ఈ పథకం కింద నిధులతో పనులు చేపడుతున్న సమయంలో కనీస సమాచారం లేకుండా క్షేత్ర స్థాయిలో ఇష్టానుసారంగా పనులు నడుస్తున్నాయని చెప్పారు. అనేక చోట్ల ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నాలుగైదు మండలాల్లో ఇది అధికంగా ఉన్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఏదోక రోజు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపడితానని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని హెచ్చరించారు. పనుల్లో తక్కువ మంది కూలీలొస్తే ఎక్కువ చూపుతున్నట్టు ఆరోపణలున్నాయన్నారు. ఇప్పటికైనా వాటిని సరిచేసుకోవాలని సూచించారు.

మున్సిపాల్టీల బకాయిలు రాబట్టండి

జిల్లాలో తాగునీటి నిర్వహణ కోసం జిల్లా పరిషత్ నుంచి నిధులు ఖర్చు పెడుతున్నామని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. వాటి నుంచి యూజర్ ఛార్జీలను వసూలు చేయడం లేదని చెప్పారు. తద్వారా ఆ భారం జిల్లా పరిషత్ నిధుల వినియోగంపై పడుతోందని తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ స్పందిస్తూ మున్సిపాలిటీల నుంచి రావాల్సిన బకాయిలు రూ.260 కోట్లు ఉన్నాయని చెప్పారు. వాటిని చెల్లించాలని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నామని వివరించారు. మరోమారు కలెక్టర్ ద్వారా లేఖ రాయిస్తామని తెలిపారు.

తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మూడు నెలలుగా శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మెలో ఉండటంతో సురక్షిత తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దిశా కమిటీ సభ్యులు ఒకరు తెలిపారు. తమ గ్రామం ఆవులెన్నలో ఫ్లోరైడ్ నీళ్లు తాగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తే సురక్షిత నీరు వస్తుందని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఎంపీ స్పందిస్తూ త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. జుంరఘురాంపల్లిలో ప్రభుత్వ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు చేసుకున్నారని ఆ గ్రామ సర్పంచి తెలిపారు. అక్కడ కనీస వసతులు కల్పించకపోవడంతో ఇళ్లు కట్టుకున్న వారు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఉన్న వసతులు వాడుకోకపోతే ఎలా..?

ఉన్న వసతులను వాడుకోకుండా ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తే ఎలాగని జిల్లా డిసిహెచ్‌పై ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా అంబులెన్సును ఇతరులు అందజేస్తే దాన్ని వాడకుండా పక్కనపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. జనరేటర్ ఏర్పాటు చేసి ఆరు మాసాలైన వినియోగించకుండా పక్కన ఎందుకు పెట్టారని డిసిహెచ్‌ను అడిగారు. కరెంటు పోతే డయాలసిస్ రోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పై రెండింటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో తాడిపత్రితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలు అవసరమని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని ప్రతిపాదనల రూపంలో అందిస్తే మంజూరయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

ఆర్డీటీ సేవలను పునరుద్దరించాలి

ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్ఎ అనుమతి కోసం ప్రయత్నించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఎంపి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ తామే కాకుండా ముఖ్యమంత్రి స్థాయిలోనూ ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వచ్చే వారం పది రోజుల్లోపు అన్ని సమస్యలు తొలగిపోయి క్లియర్ అయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్ర పరికారాలను అందిస్తున్న ఎంపీ

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలియజేశారు. బుధవారం నాడు కలెక్టరేట్ రెవెన్యూ భవనం వద్ద రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాలను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతుల కోసం రాయితీతో 1,070 మందికి వ్యవసాయ యంత్ర పనిముట్లను అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ అవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 1,070 మంది రైతులకు 50 శాతం రాయితీతో రూ.2.29 కోట్ల రాయితీతో యంత్ర పరికరాలను అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్, ఆగ్రోస్ డిఎం ఓబుళపతి పాల్గొన్నారు.

దళితునిపై దాడి హేయం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని సింగవరం గ్రామంలో దళితునిపై దాడిని చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి పాలనలో దళితులపై దాడులు అధికం అయ్యాయన్నారు. సింగివరం గ్రామంలో దళితుడు శేఖర్ డబ్బులు ఇవ్వాలన్న కారణంతో గణేష్ నాయుడు అనే వ్యక్తి దాడి చేశాడన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు, నారాయణ, పూల ప్రసాద్, గార్లదిన్నె నాగరాజు, వడియంపేట అంజి, ఎమ్మార్పీఎస్ మోహన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

బీటెక్ ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, మే నెలలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20, 19, 15) సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 23, 19, 15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు వీటిని విడుదల చేశారు.

హెచ్‌ఎల్‌సి మరమ్మతులను వేగవంతం చేయండి

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశం

హెచ్‌ఎల్‌సి అధికారులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

హెచ్‌ఎల్‌సి మరమ్మతులు వేగవంతం చేసి నీటి విడుదలకు ముందే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన నివాసంలో బుధవా రం ఆయన హెచ్‌ఎల్‌సి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రుతుపవనాల ప్రభావంతో తుంగభద్ర ప్రాజెక్టుకు ముందే నీరు చేరుతున్నందున జులై మొదటి వారంలోనే కాలువలకు నీటి విడుదలకు యంత్రాంగం సన్నద్ధమవుతోందన్నారు. ప్రధాన కాలువ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అండర్ టన్నెల్, బ్రిడ్జి, లైనింగ్ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈసారి ముందే నీటిని విడుదల చేయడానికి వీలుగా పనుల్లో వేగం పెంచాలని, అవసరమైతే రాత్రింబవళ్లు పనులు కొనసాగించాలన్నారు. అందుకనుగుణంగా సాంకేతిక సిబ్బంది, కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ఏ మాత్రం అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. వైసిపి పాలనలో కాలువ మరమ్మతులు చేపట్టక పదేపదే గండ్లు పడి పొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం మరమ్మతులకు రూ. 35 కోట్లు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిందని గుర్తు చేశారు. సమావేశంలో హెచ్‌ఎల్‌సి లోకల్ డివిజన్ ఈఈ పార్థసారథి, డీఈ దివాకరరెడ్డి, జేఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య పరిరక్షణ

రాయదుర్గం రూరల్ : సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు యెగా ఎంతగానో ఉపకరిస్తుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం యోగా విశిష్టతపై సమావేశం నిర్వహించారు. రోగాలు చుట్టుముట్టి ఆసుపత్రుల చుట్టూ తిరక్కుండా ఉండాలంటే ఎవరికి వారు ఆహారపు అలవాట్లు, దిన చర్య స్వీయ నియంత్రణ అలవర్చుకోవాలన్నారు. యోగా ద్వారా మనసు, శ్వాస, ఆలోచనలపై నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, టి.హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంతో వినాశనం : సిఐటియు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యుద్ధం ఎవరికీ మంచిది కాదని, అది మానవ వినాశనానికి దారి తీస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీభావంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టవర్‌క్లాక్ గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో దాదాపు 60 వేల మందిపైగా పాలస్తీనియన్‌లు మృతి చెందారని తెలిపారు. వీరిలో అత్యధిక మంది చిన్నారులు, మహిళలు ఉన్నారని తెలిపారు. ఇజ్రాయిల్ దేశం ఒక జాతిని సమూలంగా నాశనం చేసే విధంగా పాలస్తీనాపై దాడులు చేస్తోందన్నారు. ఈ దుర్మార్గాన్ని భారత దేశ ప్రజలందరు ఖండించాలన్నారు. పాలస్తీనాకు సంఘీభావం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట నారాయణ, ముర్తుజ, నాయకులు సురేంద్ర, తిరుమలేశు, ఎర్రిస్వామి, ఆటో యూనియన్ అధ్యక్షులు ఆజాం, జ్యోతి, అంబులెన్స్ యూనియన్ నాయకులు అక్బర్, జిలానీ, రాజేష్ పాల్గొన్నారు.

శాంతియుత నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుర్తిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు అందించి గుర్తిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికలపై రాయల్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కర్నూలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, అనంతపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, టిడిపి కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర కన్వీనర్ కుమ్మర పోతులయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్ రెడ్డి సర్వనాశనం చేశాడని తెలిపారు. జగన్ పల్నాడు పర్యటన కేవలం తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకేనన్నారు. అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో కష్టపడ్డ వారికి మాత్రమే పదవులు ఉంటాయని స్పష్టం చేశారు.

చెత్తసేకరణ నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

సెక్రటరీ సస్పెన్షన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని అరవింద్ నగర్ ప్రాంతంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం సక్రంగా జరగకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరవింద్ నగర్ ప్రాంతంలో చెత్త సేకరణ సరిగా జరగలేదంటూ ఇటీవల స్థానికులు నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం నాడు కమిషనర్ బాలస్వామి ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడారు. ప్రజల ఫిర్యాదులు వాస్తవం అని తేలడంతో సంబంధిత సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు. వార్డు ఎన్విరాన్మెంట్ శానిటేషన్ సెక్రటరీ నరసింహమూర్తిని సస్పెండ్ చేశారు. మూడవ వార్డుకు సంబంధించిన శానిటరీ ఇన్సెపెక్టర్ సి.వెంకటేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. గతంలో సైతం శానిటరీ ఇన్స్‌పెక్టర్ పనితీరు సక్రమంగా లేకపోవడంతో విధుల నుంచి తప్పించి మేస్త్రిగా మార్చారు. కొంతకాలానికే ఆయన కీలకమైన మూడవ సర్కిల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులయ్యారు. కార్పొరేషన్‌లో పలుమార్లు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్న వారిని సస్పెండ్ చేయడం కొంతకాలానికే మళ్లీ వారికి నియామకాలు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల రెండు సర్కిళ్లకు సంబంధించి శానిటరీ ఇన్స్‌పెక్టర్లపై చర్యలు తీసుకున్నారు. కొంతకాలానికే మళ్లీ వారిని విధుల్లోకి తీసుకోవడం గమనార్హం.

జిల్లాకు చేరిన ఇఫ్‌కో ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు కేటాయించిన ఎరువుల్లో భాగంగా ఇఫ్ కో కంపెనీ చెందిన 1967 మెట్రిక్ టన్నుల డిఎపి, 762 మెట్రిక్ టన్నులు 20:20:0:13 కాప్లెక్స్ ఎరువులు వచ్చాయి. ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు ఈ ఎరువుల చేరినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. వాటిని పరిశీలించి సంభంధిత గోదాముల్లో నిల్వ చేశామన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

అనంతపురం : అనంతపురం అర్బన్ సిడిపిఒ పరిధిలోని నేతాజీ కాలనీ అంగన్వాడీ సెంటర్‌ను బుధవారం సిడిపిఒ ఎం.అనురాధ తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే టేక్ హోమ్ రేషన్ సక్రమంగా తల్లులకు అందుతుందా లేదా అని ఆరా తీశారు. ప్రీస్కూల్ పిల్లలకు ఇచ్చే ఆహారం నాణ్యతను పరిశీలించారు. సిడిపిఒ వెంట అంగన్వాడీ టీతచర్ జి.తనిర్మల, హెల్పర్ నారాయణమ్మ ఉన్నారు.

తల్లీతండ్రి మరణం

అనాథలైన ముగ్గురు చిన్నారులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్థిక సాయం అందిస్తున్న గోవిందప్ప

రెండేళ్ల వ్యవధిలో తల్లిదండ్రులు ఇద్దరూ మరణించడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. కళ్యాణదుర్గం పట్టణం కొల్లాపురమ్మ గుడి వీధికి చెందిన చిత్రమ్మ రెండేళ్ల క్రితం మృతి చెందింది. ఈమె భర్త బాలు (40) బుధవారం నాడు అనారోగ్యంతో మరణించాడు. వీరికి కుమారులు తిప్పేస్వామి, బాబు, కుమార్తె హారికలు సంతానం. తిప్పేస్వామి 4వ తరగతి, బాబు 3వ తరగతి చదువుతున్నారు. ఇక కూతురు హారికకు రెండు సంవత్సరాలు. ప్రస్తుతం వీరి ఆలనాపాలనా అమ్మమ్మ చౌడక్క చూస్తోంది. చిన్నారుల పరిస్థితిని తెలుసుకున్న టీడీపీ నాయకుడు బిక్కి గోవిందప్ప ఆ కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి : విప్

విద్యార్థినికి కిట్ అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతిభావంతులకు సమాజం ద్వారా తగిన ప్రోత్సాహం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలవ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్య సాధనతో పాటు సమాజం పట్ల బాధ్యత, విలువలు అలవర్చుకోవాలని సూచించారు. విద్య విలువ తెలిసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి పారదర్శకంగా చేశారన్నారు. డీఎస్సీ ద్వారా త్వరలోనే 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయబోతున్నారని వివరించారు. ఇంటర్ విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కళాశాల అభివృద్ధికి ఎప్పుడూ తనవంతు సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలు ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి భవిష్యత్తులో ఈ ప్రాంతాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా తమ చదువులకు అవసరమైన సమాచారం కోసం మినహా అనవసర విషయాల్లో సోషల్ మీడియా జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. అనవసర అంశాల్లో వివాదాలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నగేష్, వీరేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, కౌన్సిలర్ ప్రశాంతి, నాయకులు టి.హనుమంతు, బండి భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి నగరం నీళ్లు..!

అనుమతి కోరుతూ కమిషనర్‌కు ఆర్‌డబ్ల్యుఎస్ లేఖ

రూ. 10 కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

నీటి తరలింపుతో నగరానికి సమస్య ఏర్పడే అవకాశం

నిర్ణయం ఏమిటన్నదానిపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర ప్రజలకు పెన్నఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పిఎబిఆర్) నుంచి నీరు అందుతున్నాయి. తాజాగా సెంట్రల్ యూనివర్సిటీకి పిఎబిఆర్ తాగునీటి పైప్‌లైన్ నుంచి నీరు అందించే ప్రణాళికలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చేపట్టారు. బళ్లారి బైపాస్‌లో ఎంవైఆర్ కళ్యాణ మండపం దగ్గర పిఎబిఆర్ పైప్‌లైన్‌కు రంధ్రం చేసి అక్కడి నుంచి సెంట్రల్ యూనివర్సిటీకి నీరు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీ వరకు రూ.10 కోట్ల వ్యయంతో పైపులైన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. ఇందులో భాగంగా ఒంగోలుకు చెందిన విఆర్ ఇన్‌ఫ్రా కంపెనీకి పనులు అప్పగించినట్లు సమాచారం. ఈ విషయంపై కమిషనర్ బాలస్వామి అనుమతి కోరుతూ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు లేఖ అందించారు. దీనిపై కమిషనర్ అనుమతి ఇచ్చిన వెంటనే సెంట్రల్ యూనివర్సిటీకి పిఎబిఆర్ నుంచి నీటిని అందించే పనులు మొదలు కానున్నాయి. ఈపనులకు సంబంధించి ఇప్పటికే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రమేయం లేకుండా, ఫీల్డ్ సర్వే అంచనాలు తయారుచేసి ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజినీర్ ఆమోదముద్ర పొందడం గమనార్హం. పీఏబీఆర్ తాగునీటి ప్రధాన పైపులైనుకు 900 ఎంఎం పరిమాణంతో రంధ్రం చేసి నీటిని సెంట్రల్ యూనివర్సిటీకి తరలించనున్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి నీరు తరలించడంలో భాగంగా నగర శివారులోని సెంట్రల్ పార్క్‌లో నీటిని నిల్వ చేసుకుని అక్కడి నుంచి ఎన్‌హెచ్ 44 మీదుగా ఎన్‌హెచ్ 544-డి నుంచి వడియంపేట జంక్షన్ నుంచి తరలించాలనే ప్రతిపాదన ఉంది. ఇది కాకుంటే కొడిమి వద్ద పంపింగ్ స్టేషన్‌తో ప్రమేయం లేకుండా నేరుగా నరసనాయని కుంట, తాటిచెర్ల, వడియంపేట మీదుగా జంతలూరులోని సెంట్రల్ యూనివర్సిటీకి నీటిని తరలించేందుకు అనుమతి ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కోరారు. కొడిమి జంక్షన్ వద్ద పైప్‌లైన్‌కు 1100 ఎంఎం పరిమాణంతో నీటిని తరలించుకునేందుకు అనుమతి కోరుతూ ఆర్‌డబ్ల్యుఎస్ అనంతపురం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ లేఖను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వారం రోజుల క్రితం అందించారు. దీనిపై కమిషనర్ ఆమోద ముద్ర వేస్తే సెంట్రల్ యూనివర్సిటీకి నీటి తరలించే పనులు వెంటనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

'సత్యసాయి' నీటిని అందించే అవకాశం ఉన్నా...

సెంట్రల్ యూనివర్సిటీకి బుక్కరాయసముద్రం వద్ద ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యసాయి పంపింగ్ హౌస్ ఉంది. దాని ద్వారా సెంట్రల్ యూనివర్సిటీకి నీరు తీసుకెళ్లే అవకాశం ఉంది. దానిని కాదని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీటిని అందించే పీఏబీఆర్ పైప్‌లైన్ ద్వారా నీరు తీసుకెళ్లాలని ప్రతిపాదించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

నగరానికి నీటి సరఫరా అంతంతమాత్రమే..!

పిఎబిఆర్ ద్వారా అనంతపురం నగరానికి నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో పైప్‌లైన్ ద్వారా సెంట్రల్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తే భవిష్యత్తులో నగరానికి మరింత నీటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనంతపురం నగరంలోని పలు ప్రాంతాలకు రోజు మార్చి రోజు నీటిని నిర్ణీత సమయం మేరకే సరఫరా చేస్తున్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్యలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయడానికి నెలకు రూ.71 లక్షలను ఖర్చు చేస్తున్నారు. తరచూ పైప్‌లైన్ లీకేజీలు, మోటార్లు మరమ్మతులతో మున్సిపల్ కార్పొరేషన్‌పై అదనపు భారం పడుతోంది. ఈ సమస్యలు పరిగణలోకి తీసుకోకుండా ఆర్‌డబ్ల్యుఎస్ సెంట్రల్ యూనివర్సిటీకి నీరు ఇచ్చే పనులు చేపట్టేందుకు సిద్ధం అవడంపై నగర వాసుల నుంచి కొంత వ్యతిరేకత వినిపిస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీకి నీటిని అందించడంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేకున్నా, ఇప్పటికే నగర ప్రజలు నీటి సమస్యతో సతమతం అవుతున్న తరుణంలో నగర ప్రజలకు అందించే నీటిని అక్కడికి తరలిస్తే ఇక్కడి వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కార్పొరేషన్ పాలకవర్గం, అర్బన్ ఎమ్మెల్యే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

కౌలు రైతు కుటుంబాలను ఆదుకోవాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేషులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గుంటూరు, పల్నాడులో కౌలు రైతులు కొండయ్య, గోపాల్‌రావు, ఆదినారాయణ సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక, అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులు ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి పొగాకు, మిర్చి, పత్తి, వేరుశనగ, తదితర పంటలు సాగు చేశారన్నారు. గిట్టుబాటు ధరల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సాగు ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గడం తో తీవ్రంగా నష్టపోయిన రైతులు అప్పులు ఎలా తీర్చాలో తెలియన మనస్థాపంతో ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మ హత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో నియోజకవర్గం అధ్యక్షులు సురేష్, ఆ సం ఘం నాయకులు అశ్వర్థ నారాయణ, సుంకన్న, బజా ర్ సుంకన్న, ధనుంజయ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సిపిఎం రాస్తారోకో

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా గాంధీ కూడలికి చేరుకుని అక్కడ బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి, బిసి కాలనీలకు ప్రధాన రహదారులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో కాలనీవాసులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని, వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ, ఎన్.రేణుక, యు.మల్లికార్జున, రేవతి, కవిత, డివైఎఫ్ఐ నాయకులు అశోక్, చందు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం ఎంపిడిఒగా రంగనాయకులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల నూతన ఎంపిడిఒగా రంగనాయకులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈవోఆర్‌డిగా పని చేస్తున్న రంగనాయకులును ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమిస్తూ జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ జడ్పీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. రంగనాయకులు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, తన కర్తవ్యాలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. అలాగే కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీలో అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పాల్వాయి గ్రామంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు

అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పాల్వాయి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిడిపిఒ లక్ష్మీప్రసన్న హాజరై మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ విద్యా బోధన షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని, పోషకాహారం అందిస్తారని కావున ప్రతి తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు సమీప అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకొని ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలన్నారు. ప్రతి చిన్నారినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. అనంతరం పల్లెంలో బియ్యం వేసి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అలాగే ఐదేళ్లు నిండిన ప్రైమరీ స్కూల్‌కి వెళ్తున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్లు మండలంలోని పాల్తూరు అంగన్వాడీ సెంటర్లలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పావతి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముందుగా చిన్నారులు, తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రం నుంచి పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి పాఠశాలలో చేర్పించారు. అలాగే మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి పిల్లల చదువు, పోషకాహారం, కిశోర్ బాలికలు, బాల్యవివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు దుర్గాదేవి, లక్ష్మీదేవి, ఈరమ్మ, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, నాగవేణి, పిల్లల తల్లిండ్రులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్... నిర్వాహకులపై ఆగ్రహం..!

ప్రజాశక్తి-రాయదుర్గం

నీరు కలిపిన పెట్రోల్‌ను చూపుతున్న మల్లికార్జున

పట్టణంలోని లక్ష్మీబజార్‌లో ఉన్న పెట్రోల్ బంక్‌లో నీరు కలిసిన కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నట్లు సిపిఎం నాయకులు మల్లికార్జున ఆరోపించారు. ఆయన బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించి కొంత ముందుకు వెళ్లగానే ఆగిపోయింది. ఎంతకూ బైక్ స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ దగ్గరకు వెళ్లగా తనిఖీ చేసిన మెకానిక్ బైక్ ట్యాంక్‌లో పెట్రోల్ ఖాళీ చేయగా అందులో నీళ్లు కలిశాయని తెలిపాడు. గతంలో కూడా వేరే పెట్రోల్ బంకుల్లో నీరు కలిసిన పెట్రోల్ వచ్చిన సంద ర్భాలు ఉన్నా అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు మండిపడుతు న్నారు. నీరు కలిసిన పెట్రోల్ ఇంజిన్‌లోకి వెళ్తే వాహనం సీజ్ అవ్వడమే కాకుండా రూ. 4వేల వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టి కల్తీ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. లేనిచో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కావలి కొట్రేష్ హెచ్చరించారు.

స్కేటింగ్‌లో తేజాన్వితకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-అనంతపురం



స్కేటింగ్ చేస్తున్న తేజాన్విత

నగరంలోని కమలానగర్‌కు చెందిన శారద, శివరామ దంపతుల కుమార్తె తేజాన్విత స్కేటింగ్ లో రెండు బంగారు పతకాలు సాధించింది. తిరుపతిలో ఈ నెల 12వ తేదీ స్టేట్ జోనల్ ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్-2025 జూన్-1 పోటీలు జరిగాయి. ఇందులో ఐదేళ్ల తేజాన్విత స్పీడ్ స్కేటింగ్‌లో క్వాడ్స్ విభాగంలో ప్రతిభను చాటింది. రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది. దీంతో కోచ్‌లు నాగేంద్ర, అన్నప్ప, హేమంత, ఆనంద్, చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పామిడి తహశీల్దార్‌గా షర్మిల

ప్రజాశక్తి-పామిడి

మండల నూతన తహశీల్దార్‌గా షర్మిల బుధవారం బాధ్యతలు చేపట్టారు. బెళుగుప్పలో పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీధర్‌మూర్తి బుక్కరాయసముద్రంకు వెళ్లారు. నూతన తహశీల్దార్ షర్మిల మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలో భాగస్వామ్యమినవుతానన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

గుంతకల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఎటిఎం. నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద నాయకులు, కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మున్సిపల్ కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని, వారికి సంక్షేమ పథకాలు వర్తింపచేయక పోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాల ద్వారా కార్మికుల కడుపు నిండదన్నారు. 'యోగాంధ్ర' పేరుతో రూ. కోట్లు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు జీవో-36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, లేనిపక్షంలో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, నాయకుడు ఈశ్వరయ్య, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు సూరిపోగుల రాజ్‌కుమార్, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్.ఎ.మురళి, నాయకులు శ్రీనివాసులు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

గుంతకల్లు : న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయడంతో పాటు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందుగా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందించక పోవడంతో ఆయన ఛాంబర్ ముందు కూర్చుని నినాదాలు చేశారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షులు జగదీష్ మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, యూనిఫామ్, సబ్బులు, నూనె, పనిముట్లు ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, అదనపు కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి సాకే నాగరాజు, యూనియన్ నాయకులు రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, దాసు, సామెల్, తిమ్మప్ప, కార్మికులు పాల్గొన్నారు.

'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్రకు మద్దతు

రంగయ్యకు మద్దతు తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆర్‌డిటి(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్)విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ 'సేవ్ ఆర్‌డిటి' పేరుతో మాజీ ఎంపీ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు బుధవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ సంఘీభావం తెలిపారు. బంగి శివ మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆర్‌డిటి ఓ వరం అన్నారు. నిస్వార్థమైన సేవలు అందిస్తున్న ఆర్‌డిటిపై కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా కత్తి కట్టడం బాధాకరం అన్నారు. ఆర్‌డిటికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించడానికి కరువు బిడ్డలంతా తోడవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రంతో మాట్లాడి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కళ్యాణదుర్గం రూరల్ : మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్ర మండలంలోని చాపరి గ్రామం చేరుకోగా జై భీమ్ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు విలియమ్స్, లీగల్ అడ్వైజర్ అలెగ్జాండర్ మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ 50 ఏళ్లకు పైగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయం, క్రీడలు, తదితర రంగాల్లో విశేష సేవలందిస్తున్న ఆర్‌డిటి సంస్థకు కష్టం వచ్చిందని మనమందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటికి వెంటనే ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేడు ముగియనున్న 'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్ర

కళ్యాణదుర్గం టౌన్ : మాజీ ఎంపీ తలారి రంగయ్య నియోజకవర్గంలో చేపట్టిన 'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్ర గురువారం ముగియనుంది. ఇందులో భాగంగా పట్టణంలోని ఆర్‌డిటి ఆసుపత్రి ఎదురుగా బహిరంగ సభ ఉంటుందని, వైసిపి శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరనాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు శోభారాణి, హనుమంతప్ప, ఎంపీటీసీ బలరామ్, మండల కన్వీనర్లు సూరి, చంద్రశేఖర్, సుదీర్, మహిళా నాయకురాళ్లు నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ కాంతమ్మ, కృష్ణారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగమవ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే

ప్రతి ఒక్కరి దినచర్యలో యోగా భాగం కావాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. 'యోగాంధ్ర-2025'లో భాగంగా బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఆర్‌డిఒ కేశవ నాయుడుతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ తప్పనిసరిగా ఒక గంట యోగా చేయాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, ఏదైనా చిన్న చిన్న శ్వాస సమస్యలున్నా తగ్గే ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలికల హాస్టల్‌ను ప్రారంభించారు. అలాగే జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంఈఓ నరసింహరాజు, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-పుట్లూరు

యోగా పై సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అలివేలమ్మ

మండలంలోని అన్ని గ్రామాల్లో పనుల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో అలివేలమ్మ టిఎలకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అందులో భాగంగా ఫారం పాండ్‌లు తవ్వాలని, కూలీలకు రోజుకి కనీసం రూ. 300 వేతనం పడేలా అవగా హన కల్పించాలని, ఇంకుడు గుంతలు తవ్వించాల న్నారు. కొత్తగా హార్టికల్చర్ లిస్టు తయారు చేయా లని, పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయా లని ఫీల్డ్ అసిస్టెంట్, బిఎఫ్‌టి, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, బిఎఫ్‌టిలు, ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

21న యోగా డే

ఈ నెల 21వ తేదీ ప్రతి సచివాలయంలో యోగా డేను ఘనంగా నిర్వహించడంతో పాటు అప్‌డేట్ చేయాలలని ఎంపీడీవో అలివేలమ్మ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అలివేలమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు. అయితే ఈ సమావేశంలోనైనా తాగునీరు, విద్యుత్, తదితర సమస్యలను ప్రస్తావించి పరిష్కరిస్తారా లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అనధికార లేఅవుట్లపై అహుడా చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలో అనుమతులు లేకుండా వేసే అనధికార లే అవుట్లను ఏమాత్రం ఉపేక్షించబోమని అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, వైస్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ స్పష్టం చేశారు. వారి సూచనల మేరకు బుధవారం అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్‌చౌదరి నారాయణపురం, నర్సనాయుని కుంట, కక్కలపల్లి, సోమలదొడ్డి ఆయా పంచాయతీల కార్యదర్శులతో కలిసి పర్యటించారు. అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను తొలగించారు. తక్షణమే ఆయా లేఅవుట్ల యజమానులు అహుడా అనుమతులు తీసుకోవాలని, లేనిచో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం : ప్రమదావశాత్తూ కాలుజారి టెంకాయ చెట్టుపై నుంచి కింద పడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన వీరేష్(37) గత నెల 12వ తేదీ టెంకాయలు కోసేందుకు తన ఇంటికి సమీపంలోని టెంకాయ చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కిందకు పడడంతో తీవ్రంగా గాయపడిన అతడిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లాగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజా మున మృతి చెందాడు. అతడికి భార్య నింగమ్మ, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

యాడికి : స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం సమీపంలో ఉన్న ఓ గడ్డివామికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. గమనించిన యజమాని మాదాసు రామిరెడ్డి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ రమణయ్య, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గడ్డివామి కాలి బూడిదవడంతో సుమారు రూ. 1.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

పేరు మార్పు / సవరణ

నేను బోయ రామాంజనేయులు, S/o బి.నరసింహప్ప, నివాసం : డోర్ నెం. 3-18-బి, బోయవీధి, పరిగి, అనంతపురం జిల్లా. ప్రస్తుతం నా కుమార్తె ఆధార్‌కార్డులో పేరు **లీలావతి** అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల లిస్టు ప్రకారం నా కుమార్తె పేరు సవరణ చేయగా **బి. స్వాతి D/o బి.రామాంజనేయులు (B.Swathi, D/o B.Ramanjaneyulu)** గా మార్పు చేయుట జరిగినది. నేటి నుండి నా కుమార్తె పేరును **బి.స్వాతి**గా పిలవబడును. ఆధార్‌లో పేరు మార్పు కొరకు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE : RAYADURG
O.S. No:83/2022

Between:
Andhra Bank, now Union Bank, Kanekal,
Represented by its Branch Manager,
...Plaintiff

V/S

Poola Rama Mohan Reddy & 3 others
...Respondents

NOTICE

To,
Poola Rama Mohan Reddy
S/o. Late Poola Rami Reddy, H.No.8-207,
O.C.Colony, K.Kothapalli Village
Kanekal, Mandal Ananthapur Dist.

Please take notice that the above named plaintiff had filed the above suit against you for recovery of suit amount and the same is posted to 25.06.2025 for your appearance. So you are hereby directed to appear before the above Court at 10-30 A.M. on 25.06.2025 either in person or through the Counsel without fail, with all documentary evidence on which you propose to defend in the above matter. If you fails to appear on that day you will be set ex parte and the matter will be determined ex parte.

(By Order of the Court)
M.HANUMANTHA REDDY
Advocate, Rayadurg.

సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి నేతకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ పరామర్శ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు నంబూరి సత్యనారాయణకు మార్క్ హాస్పిటల్‌లో స్టంట్ వేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మండలం నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయుడు ఆగ్రామం వెళ్లి సత్యనారా యణను పరామర్శించారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి-యాడికి

రైతుల భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి రీసర్వే బృందం సభ్యులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రీ సర్వే బృందంతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ అధికారులు రీ సర్వే ముందు రోజే సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు, ఒకవేళ సమాచారం ఇచ్చినా సంబంధిత రైతులు రాకపోతే మరొకసారి అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆర్ఐ కృష్ణయ్య, మండల సర్వేయర్ శేషసాయి, రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.

'కోతల ప్రభుత్వం'

ప్రజాశక్తి-రాయదుర్గం

కూటమి ప్రభుత్వం కాస్త కోతల ప్రభుత్వంగా మారిందన్న విషయం తల్లికి వందనం అమలులో తేటతెల్లమైందని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఒక్కో విద్యార్థికి రూ. 15వేల చొప్పున ఇస్తామని ప్రచారం ఊదరగొట్టి నేడు రూ. 13వేలతో సరిపెట్టిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విద్యార్థుల తల్లులను మోసం చేయడంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలు దొందూ దొందే అన్నారు. రాష్ట్రంలో 87,41,885 మంది ఉన్నారని గణాంకాలు చెబుతుండగా 67,27,164 మంది విద్యార్థులు అని ప్రకటన చేసి వారికి మాత్రమే నిధులు విడుదల చేయడం దారుణమన్నారు. మిగిలిన విద్యార్థులకు తల్లికి వందనం వర్తింపజేయాలని, లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

సర్వేయర్ల అవినీతిని అరికట్టండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మండలంలో సర్వేయర్ల అవినీతిని అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వే కోసం రైతులు డీడీలు చెల్లిస్తే వాటిని పరిగణలోకి తీసుకోకుండా లంచం ఇచ్చే వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారన్నారు. సర్వేయర్లు బహిరంగంగానే డబ్బు డిమాండ్ చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మండలంలో ప్రధాన సర్వేయర్ ఈ అవినీతి తతంగాన్ని నడుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అచ్యుత్ ప్రసాద్

'తల్లికి వందనం' సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎంపీడీవో శకుంతలమ్మ, తహశీల్దార్ బాలాజీ రాజ్, సిఐ రామసుబ్బయ్య ఇతర అధికారులు హాజరయ్యారు. సభ్యులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చాలా మంది అర్హులకు 'తల్లికి వందనం' వర్తించలేదని, అందుకు వారికి ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్నట్లు కారణం చూపారన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో రీ సర్వే చేయడం వల్ల రైతుల సమన్వయ లోపంతో జాయింట్‌గా రావడం వల్ల ఎక్కువ భూమి చూపిస్తుందన్నారు. అలాంటి వారికి 'తల్లికి వందనం' వర్తించేలా చూడాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ రైతులందరూ ఒప్పుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే 'తల్లికి వందనం' కోసం ఏ రైతుకు ఎంత భూమి ఉందో రికార్డుల్లో చూసి ఆ మేరకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రీతి, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ లక్ష్మీనారాయణ, ఏపీవో గంగరాజు, వెటర్నరీ వైద్యులు జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-యాడికి

ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా నగరూరు ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. దీంతో బుధవారం హెచ్‌ఎం కుళ్లాయప్ప ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది ఆ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.శ్రీనివాస్‌యాదవ్ (ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) యాడికి పాఠశాలకు, బయాలజీ ఉపాధ్యాయుడు మార్కస్ అప్పిదొడ్డికి, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కేశవ నాయుడు హెచ్‌ఎంగా జక్కలచెరువుకు, గణితం ఉపాధ్యాయుడు రమణ బత్తలపల్లికి, పిడి మహబూబ్‌బాషా అమ్మలదిన్నెకు బదిలీ అయ్యారు. వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, నరేంద్ర, కుళ్లాయప్ప, గోపాల్, సావిత్రి, రఘురామయ్య, స్వరూపారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ

రైతు అంత్యక్రియల్లో పాల్గొన్న ఏవో లీనా వసుంధర

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండలంలోని నల్లదాసరపల్లి గ్రామంలో గత మంగళవారం గుండాల నాగలింగ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సమాచారం మేరకు బుధవారం మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర సంబంధిత అధికారులతో కలిసి ఆ గ్రామం వెళ్లి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతు నాగలింగ తన భూమిలో మిరప, మొక్కజొన్న, వేరుశెనగ, తదితర పంటలు సాగు చేసి సుమారు రూ. 15 లక్షల వరకూ అప్పుల పాలైనట్లు వారి బంధువుల ద్వారా తెలిసిందన్నారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సహకారంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలను అందించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'కు ఈకేవైసీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండల వ్యాప్తంగా రైతులందరి చేత(వంద శాతం) ఈకేవైసీ పూర్తి చేసి, ప్రతి రైతుకూ లబ్ధి చేకూర్చాలని అనంతపురం రైతు శిక్షణ కేంద్రం ఏవో లక్ష్మీనరసింహులు, విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి హెచ్.పెన్నయ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పాల్తూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగులో పశువుల ఎరువు వేస్తే నేల సారవంతమై మొక్కలు బాగా పెరిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. కంది విస్తీర్ణం బాగా పెరిగిందని అధిక దిగుబడి ఇచ్చే రకాలు సాగు చేయాలని సూచించారు. మట్టి నమూనా పరీక్ష ఫలితాల మేరకు రసాయనిక ఎరువులు వేయాలన్నారను. వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణకు మందులను సూచించారు. కార్యక్రమంలో ఎంపిఈఓ మెర్సి, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ కరపత్రాలు విడుదల

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు గురుమూర్తి మాట్లాడుతూ జులై 7వ తేదీ ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అందరూ ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 29 ప్రభుత్వ వసతి గృహాల్లో బుధవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి తిరుపాలయ్య ఆధ్వర్యంలో ఆయా హాస్టళ్ల వార్డెన్లు లిక్విడ్‌ను స్ప్రే చేయించారు. విద్యార్థులు డెంగీ, మలేరియా, చికెన్ గూన్యా లాంటి రోగాల బారిన పడకుండా దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వార్డెన్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ గంగరాజు, ఆరోగ్య కార్యకర్త సుభాషిణి పాల్గొన్నారు.

అర్జీలపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన దరఖాస్తు మేరకు బుధవారం తహశీల్దార్ బాలాజీ రాజ్ మండలంలోని దేవునిఉప్పలపాడు గ్రామంలో విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పూజారి నారమ్మ అనే మహిళ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు భూ సమస్యపై ఇచ్చిన అర్జీ మేరకు విచారణ చేపట్టామన్నారు.

పుట్టపర్తి సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా రమేష్ నాయక్

ప్రజాశక్తి-పామిడి

పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ ఆర్.రమేష్‌నాయక్‌ను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతలు అప్పజెప్పిన టిడిపి అధిష్టానం, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల దాడికి నిరసనగా ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసుల దాడిని ఖండిస్తూ బుధవారం పట్టణంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నాయకులు రాజు, సచిన్, అక్బర్, కార్తీక్, హుసేన్, కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.

పేకాటపై సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఎవరైనా గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ రామ సుబ్బయ్య సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో యాడికి సర్కిల్ సిఐ రామసుబ్బయ్య పోలీస్ సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా ఆర్గనైజ్డ్ గ్యాంబ్లింగ్ జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాంబ్లింగ్ సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, గ్యాంబ్లింగ్‌కు సంబంధించి ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్యాంబ్లింగ్ సమాచారం తెలిస్తే సిఐ 94913 08871, ఎస్ఐ 9346010575కు ఫోన్ చేయాలని సూచించారు.

జగన్‌ను కలిసిన ప్రవాసాంధ్రులు

ప్రజాశక్తి-శింగనమల

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో వివిధ దేశాల నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ వైసిపి నేతలు ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం జగన్‌ను కలిశారు. వారు పార్టీ బలోపేతం చేయడంలో వారి పాత్ర, భావాలు, సూచనలు, ఆకాంక్షలను జగనకు వివరించారు. పార్టీ పునర్నిర్మాణం, వచ్చే ఎన్నికల్లో విజయం సాధిం చేందుకు ప్రవాస నాయకుల సహకారం కీలకమని జగన్ స్పష్టం చేశారు. ఆ దిశగా పని చేయాలని సూచనలు చేశారు. జగన్‌ను కలిసిన ప్రవాసంధ్రుల్లో పెద్దిరెడ్డి, కృష్ణ, కుమార్‌రెడ్డి, సారధి వంగా, కామేష్, నవీన్, వంశీ ఉన్నారు. వారు మాట్లాడుతూ 'మేము ప్రపంచవ్యాప్తంగా వైసిపి అభిప్రాయాలను విస్తరింపజేస్తూ, జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేయాలన్న లక్ష్యంతో సమిష్టిగా పని చేస్తున్నాం" అని తెలిపారు. ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మీసేవా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-బ్రహ్మ సముద్రం

మండలంలోని కన్నెపల్లి, రాయలప్పదొడ్డి, బొమ్మగానిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న మీసేవా కేంద్రాలను బుధవారం తహశీల్దార్ సుమతి తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. మీసేవా కేంద్రంలో లభ్యమయ్యే సేవలను పట్టికలో ప్రదర్శించాలన్నారు. పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహ పూర్వక వాతావరణంలో సేవలు అందించాలన్నారు. ఎక్కువ రుసుము తీసుకుంటే చర్యలు తప్పవు అన్నారు. ఆమె వెంట ఆర్ఐ నాగిరెడ్డి, విఆర్ఓ శ్రీనివాసులు, మీసేవా నిర్వాహకుడు రాజు ఉన్నారు.

మీ సేవా కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి